సాక్షి ఖమ్మం

మంగళవారం : 10 : అక్టోబర్ : 2023



కేజీబీవీలో భద్రమేనా?

జిల్లా కేంద్రంలోని వెలుగుమట్ల గుట్టపై ఉన్న కేజీబీవీలో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 8లో



గంజాయి కలకలం

ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో ఒకేరోజు 25కేజీలకు పైగా గంజాయి పట్టుబడడం జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించింది. 8లో

గరిష్టం/కనిష్టం 36°/25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. సాయంత్రం దాటాక వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ఖమ్మంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్

ఎంపీ వద్దిరాజు వినతికి స్పందన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నుంచి తమిళనాడు వెళ్లే ప్రయాణికుల చిరకాల కోరిక నెరవేరింది. న్యూఢిల్లీ నుంచి చెన్నై వరకు రాకపోకలు సాగించే తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు ఖమ్మం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటివరకు ఈ రైలుకు విజయవాడ, వరంగల్‌లో మాత్రమే హాల్టింగ్ ఉండగా... ఇటీవల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఖమ్మంలో పలు రైళ్లు ఆపాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం పరిసర ప్రాంతాల్లోని గ్రానైట్, ఇతర పరిశ్రమల్లో తమిళనాడుకు చెందిన కార్మికులు పనిచేస్తున్న విషయాన్ని వివరించారు. దీంతో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌కు ఖమ్మంలో హాల్టింగ్ ఇవ్వగా, ఈ నిర్ణయం సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. కాగా, తమిళనాడు ఎక్స్‌ప్రెస్ చెన్నై నుంచి న్యూఢిల్లీ వెళ్లే మార్గం (12621)లో ప్రతిరోజు ఉదయం 5.24 గంటలకు, ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే మార్గం (12622)లో ప్రతిరోజు రాత్రి 8.54 గంటలకు ఖమ్మం చేరుకుంటుంది.

వినతులు పెండింగ్‌లో ఉండొద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్: గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ప్రతీ దరఖాస్తును త్వరగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై పరిష్కారంపై సూచనలుచేశారు. కలెక్టరేట్ ఏఓ అరుణ, వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఉద్యానవన శాఖ అధికారి అనసూయతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈవారం అధికంగా రెవెన్యూ, పెన్షన్ల కోసం దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా శ్యాంప్రసాద్



శ్యాంప్రసాద్

ఖమ్మంఅర్బన్: ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా శ్యాంప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్‌ఈగా ఉన్న లక్ష్మణ్ కరీంనగర్ బదిలీ కాగా ఈఈగా ఉన్న శ్యాంప్రసాద్‌కు ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆయన బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పలువురు ఎస్‌ఈకి శుభాకాంక్షలు తెలిపారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ముత్తంగి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సోమవారం స్వామివారికి ఈ అలంకరణ చేయడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సమరానికి సై

ఈనెల 4న ప్రకటించిన తుది జాబితా ప్రకారం పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు



షెడ్యూల్ విడుదలతో మోగిన ఎన్నికల నగారా

- వచ్చే నెల 30న పోలింగ్.. అమల్లోకి వచ్చిన కోడ్
- ప్రజాప్రతినిధుల అధికారిక పర్యటనలకు బ్రేక్
- ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- తనిఖీల్లో తొలిరోజే రూ.30 లక్షలకు పైగా నగదు స్వాధీనం
- అభ్యర్థుల ప్రకటన, ప్రచారంతో బీఆర్‌ఎస్‌లో జోష్
- ఎప్పుడు ప్రకటిస్తారోనని కాంగ్రెస్‌లో ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల సమరానికి సైరన్ మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వచ్చే నెల 30న పోలింగ్ జరగనుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల చేయగా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తయింది. ఎన్నికల నగారా మోగిన నేపథ్యాన వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో ప్రజాప్రతినిధుల అధికారిక పర్యటనలకు బ్రేక్ పడింది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ప్రారంభించారు. కాగా, ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారంలో బీఆర్‌ఎస్ దూసుకెళ్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు ప్రకటన కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

సరిగ్గా 51 రోజులు

నేటి నుంచి లెక్కిస్తే పోలింగ్‌కు ఇంకా 51 రోజుల సమయం ఉంది. వచ్చే నెల 3న నోటిఫికేషన్ వెలువడనుండగా, అదేనెల 30న పోలింగ్ జరుగుతుంది. అదేరోజు నుంచి నవంబర్ 10 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించి, 13న పరిశీలించడంతో పాటు 15న ఉపసంహరణకు అవకాశమిస్తారు. ఆ తర్వాత బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారు. ఇక నవంబర్ 30న పోలింగ్ జరగనుండగా, డిసెంబర్ 3న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. అయితే, 2018 ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 7న పోలింగ్ జరగగా.. ఈసారి వారం ముందుగానే జరగనుంది.

తొలిరోజే రూ.30.65లక్షలు స్వాధీనం

ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఉద్యోగులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, ప్రియాంక అల పలుమార్లు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అలాగే, నమూనా ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల తుది జాబితాను ఈనెల 4న విడుదల చేయగా, ఖమ్మం జిల్లాలో ఎన్నికల పర్యవేక్షణకు 24 మంది నోడల్ అధికారులను నియమించారు. అలాగే, తనిఖీల కోసం ఏర్పాటుచేసిన 12 చెక్‌పోస్టులను సోమవారం నుంచి ప్రారంభించారు. కాగా, మధిర మండలం ఆత్కూరు క్రాస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.17.25 లక్షలు, వైరా, తల్లాడల్లో రూ.5లక్షల చొప్పున నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కొణిజర్లలోని చెక్ పోస్టు వద్ద రూ.2.40లక్షలు, చింతకాని మండలం పందిళ్లపల్లిలో రూ.లక్ష స్వాధీనం చేసుకోగా, మొదటిరోజే రూ.30.65లక్షల నగదు పట్టుబడినట్లయింది.

అటు జోష్.. ఇటు ఉత్కంఠ

షెడ్యూల్ ప్రకటనతో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచారంలో వేగం మరింత పెరగనుంది. ఆపార్టీ అభ్యర్థులను ప్రకటించి 50 రోజులు దాటగా... ఓవైపు అసంతృప్తి కొనసాగుతున్నా బుజ్జగిస్తూనే ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ప్రచారంలో జోరు పెంచడంపై ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో చివరకు తమ నియోజకవర్గం నుంచి ఎవరు బరిలో ఉంటారని కేడర్ ఎదురుచూస్తోంది. హస్తినలో అభ్యర్థుల వడపోత జరుగుతుండగా ఆశావహులు టికెట్లు దక్కించుకునే ప్రయత్నాల్లో మునిగారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల అభ్యర్థులను కూడా ప్రకటిస్తే ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

అధికారిక పర్యటనలకు బ్రేక్



సత్తుపల్లిలో హోర్డింగ్‌లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగానే ఉమ్మడి జిల్లాలోనూ కోడ్ అమల్లోకి వచ్చింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఉదయం భద్రాచలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత సీతారామచంద్రస్వామిని దర్శించుకోగా, అనంతరం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. ఇంతలోనే కోడ్ అమల్లోకి రావడంతో ఈ కార్యక్రమాన్ని అధికారులే పూర్తిచేశారు. మిగతా నియోజకవర్గాల్లో కూడా షెడ్యూల్ వెలువడ్డాక అధికారిక కార్యక్రమాలు రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రహదారులపై పార్టీల నేతల కటౌట్లు, పోస్టర్లు, జెండాలు తొలగించడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అలాగే, నేతల విగ్రహాలు, పార్టీ స్థూపాలను ముసుగులతో కప్పేశారు.

కోడ్ అమల్లోకి వచ్చింది..



షెడ్యూల్ వెలువడడంతోనే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. గతంలో చేపట్టిన పనులు కొనసాగించాలని, కొత్తవి చేపట్టొద్దని అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లను 24 గంటల్లో, పబ్లిక్ స్థలాల్లోనివి 48 గంటల్లో, ప్రైవేట్ స్థలాల్లో ఉన్నవి 72 గంటల్లోగా తొలగిస్తాం. సీ విజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– వీ.పీ.గౌతమ్, కలెక్టర్

వాహనాలు తనిఖీ చేస్తున్నాం



షెడ్యూల్ విడుదలతో వాహనాల తనిఖీ మొదలుపెట్టాం. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 12 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశాం. నియోజకవర్గానికి మూడు చొప్పున 15 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించగా, కోడ్ ఉల్లంఘించిన, హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– విష్ణు ఎస్.వారియర్, పోలీస్ కమిషనర్

ఎన్నికల కోడ్ పక్కాగా అమలుచేయాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



పొన్నెకల్‌లోని శ్రీచైతన్య కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో పటిష్టంగా అమలుచేసేలా యంత్రాంగం సిద్ధం కావాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లా అధికారులతో పాటు ఎంసీసీ, ఎస్‌ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అతిథిగృహాలు, హెలీప్యాడ్, ప్రభుత్వ మైదానాలను ఎవరు ముందొస్తే వారికే కేటాయించాలని, పురోగతిలో ఉన్నవి కాకుండా కొత్త పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయొద్దని సూచించారు. అలాగే, అక్రమాలపై ఫిర్యాదు చేసేలా టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడమే కాక సీ– విజిల్ యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు పంచడం జరగకుండా పటిష్టమైన నిఘా వేయాలని, ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ ఏసీపీలు సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమావేశమై బృందాల వారీగా విధులు కేటాయించి చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు.

అన్ని ఏర్పాట్లుచేశాం...

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యాన హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీసీ ద్వారా జిల్లా అధికారులతో సమావేశయ్యారు. పార్టీలు, నాయకులకు సంబంధించిన హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్స్ తొలగించాలని సూచించారు. ఈ వీసీలో జిల్లా నుంచి గౌతమ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నియమావళి అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే అధికారులతో బృందాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీ గణేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఈవీఎంల భద్రత, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. సీపీ వారియర్‌తో కలిసి ఆయన సోమవారం ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు కావాల్సిన గదులు, చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, డిప్యూటీ కమిషనర్ మల్లేశ్వరి, ఏసీపీలు గణేష్, బస్వారెడ్డి, హరికృష్ణ, డీటీ రవీందర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సాగర్ ఆయకట్టుకు నీరు

- ఇన్‌ఫ్లో వస్తున్న మేర దిగువకు విడుదల
- కాల్వ చివరి నుండి ఆయకట్టుకు మళ్లింపు
- వారం పాటు విడుదలకు నిర్ణయం



పాలేరు కాల్వ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: సాగర్ ఆయకట్టులో ఎండుతున్న పంటలకు ఊపిరి పోసేలా సోమవారం పాలేరు రిజర్వాయర్ నుండి నీటిని దిగువకు విడుదల చేశారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు పాలేరు దిగువకు సోమవారం వెయ్యి క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో 2.54 లక్షల ఎకరాలకు గాను ఈ వానాకాలం సుమారు 1.85 లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు సాగు చేశారు. అయితే, కృష్ణా పరీవాహకంలో వర్షాలు లేక నాగార్జునసాగర్ డ్యాంలోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీంతో ఇప్పటివరకు నీరు విడుదల చేయకపోగా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యాన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఇందులోభాగంగా సాగర్ ఎడమ కాల్వకు మూడు రోజుల క్రితం నీరు విడుదల చేయగా పాలేరు రిజర్వాయర్‌కు సోమవారం చేరింది. సాగర్ నుండి వెయ్యి క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉండగా, అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం జలవనరులశాఖ ఓఅండ్‌ఎం ఈఎన్‌సీ నాగంద్రకుమార్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల సీఈలు విద్యాసాగర్, అజయ్‌కుమార్, ఖమ్మం ఎస్‌ఈ నర్సింగరావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ మధు తదితరులు చర్చించి నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లో 23 అడుగుల నీటి మట్టానికి గాను 21 అడుగుల మేర నీరు ఉండగా.. ఆ నీటిమట్టాన్ని కొనసాగిస్తూ సాగర్ నుండి వచ్చే మొత్తం నీటిని ఏడు రోజుల పాటు దిగువకు విడుదల చేయనున్నట్లు అధికా రులు తెలిపారు. మొదటగా సత్తుపల్లి, ఆ తర్వాత మధిర, బోనకల్లు, నందిగామ బ్రాంచ్ కాల్వల పరిధిలో ఆయకట్టుకు నీరు సరఫరా చేయనున్నారు. అయితే, తక్కువ మొత్తంలో నీరు విడుదల చేస్తున్న నేపథ్యాన ఎండుతున్న పంటలకు ఏ మేరకు ఉపయోగపడతాయో వేచి చూడాల్సిందే.

ప్లాంటేషన్‌కు ప్రత్యామ్నాయం చూపించండి



డీఎఫ్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న సాగుదారులు

కారేపల్లి: ప్లాంటేషన్ కోసం తమ నుంచి స్వీకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా భూమి చూపించాలని పలు గ్రామాల సాగుదారులు కోరారు. మండలంలోని ఎర్రబోడు, వడ్డెర గుంపు, కోయగుంపు, మాణిక్యారం, గుడితండా గ్రామాలకు చెందిన పలువురు సోమవారం ఖమ్మంలో డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కారేపల్లి ఫారెస్టు రేంజ్ ఉట్వూర్ బీట్ పరిధిలోని వంద ఎకరాల్లో 50మంది గిరిజన పోడు రైతులు వ్యవసాయం చేసుకుంటుండగా, ప్లాంటేషన్ కోసం భూమి తీసుకున్నారని చెప్పారు. అయితే, ప్రత్యామ్నాయంగా భూమి చూపిస్తామని పేర్కొని నాలుగేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదని డీఎఫ్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. వివిధ సంఘాల నాయకులు, రైతులు మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, కరపటి సీతారాములు, భూక్యా రమేష్, కరపటి అరుణ, కల్తీ కృష్ణవేణి, చల్లా మల్లమ్మ, చల్లా రమేష్, కమలమ్మ, మంగ, నరసమ్మ పాల్గొన్నారు.

పొంగులేటి, తుమ్మల భేటీ

ఎన్నికల్లో వ్యూహాలపై ఇరువురు నేతల సమాలోచన



హైదరాబాద్‌లో భేటీ అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం భేటీ అయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యాన హైదరాబాద్‌లోని పొంగులేటి స్వగృహంలో సమావేశమైన వీరిద్దరు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై రెండు గంటలకు పైగా చర్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు సాధించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని చర్చించుకున్నట్లు తెలిసింది. అలాగే, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై మాట్లాడుకున్నారని సమాచారం. ఢిల్లీలో ఓవైపు సెంట్రల్ స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల ఎంపికకు వడపోత కార్యక్రమం నిర్వహిస్తుండగా.. పొంగులేటి, తుమ్మల భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఖమ్మం, పాలేరు నుంచి వీరిలో ఎవరు, ఎక్కడి నుంచి బరిలో దిగుతారనే అంశంపై ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. ఇప్పటికే పాలేరులో తుమ్మలతోపాటు ఆయన అనుచరవర్గం గడపగడపకూ కాంగ్రెస్ పేరుతో అధిష్టానం ప్రకటించిన గ్యారంటీ కార్డులను పంపిణీ చేయగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి ఇదే నియోజకవర్గంలోని గ్రామాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

వైరా పీహెచ్‌సీకి 98 పోస్టులు

వైరా: ఇటీవల వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన వైరా పీహెచ్‌సీకి కొత్తగా 98 పోస్టులు మంజూరయ్యాయి. వివిధ విభాగాల్లో అవసరమైన పోస్టులు మంజూరు చేస్తూ ఆరోగ్య శాఖ డిప్యూటీ కమిషనర్ నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో సివిల్ సర్జన్ నుంచి థియేటర్ అసిస్టెంట్ వరకు 23 రకాల పోస్టులు ఉన్నాయి.

బాలసాని అలక

- కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరం
- అనుచరుడికి టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపం
- భద్రాచలం బాధ్యతలు తప్పించడంతో కినుక



బాలసాని లక్ష్మీనారాయణ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ నేత బాలసాని లక్ష్మీనారాయణ అలక బూనారు. భద్రాచలం నియోజకవర్గ ప్రచార సమన్వయ బాధ్యతల నుంచి ఆయనను తప్పించడంతో కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ బాధ్యతలు ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాత మధుకు అప్పగించారు. బాలసాని అనుచరుడిని కాదని తెల్లం వెంకట్రావుకు భద్రాచలం పార్టీ టికెట్ కేటాయించడం కూడా ఆయన పార్టీకి దూరంగా ఉండడానికి మరో కారణంగా తెలుస్తోంది.

ఆశించి భంగపడి..

ఎమ్మెల్సీగా బాలసాని పదవీకాలం పూర్తయ్యాక మళ్లీ అదే పదవి వస్తుందని ఆశించారు. అయితే, ఆ పదవి తాత మధుకు అప్పగించగా ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు ఇస్తారని ప్రచారం జరిగింది. చివరకు అది కూడా మధుకే దక్కగా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఏదైనా వస్తుందని భావించినా నెరవేరలేదు. ఇక భద్రాచలం నియోజకవర్గానికి చెందిన తెల్లం వెంకట్రావు ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో ఆయనకే పార్టీ టికెట్ ఇచ్చి నియోజకవర్గ ప్రచార సమన్వయ బాధ్యతలు బాలసానికి అప్పగించారు. కానీ ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌లో జరిగిన రాజకీయ పరిణామాలతో సమన్వయ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి తాత మధుకు కట్టబెట్టారు. దీనికి తోడు భద్రాచలంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత బోదబోయిన బుచ్చయ్య బాలసాని అనుచరుడిగా కొనసాగుతుండగా, ఆయనకు టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దల ముందు ప్రతిపాదించారు. అయితే, అది కూడా దక్కకపోవడంతో బాలసానితో పాటు ఆయన అనుచర వర్గం పార్టీ పెద్దలపై అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో తగిన స్థాయిలో గుర్తింపు ఇవ్వడం లేదన్న కారణంతో బాలసాని భద్రాచలం నియోజకవర్గంలో అడుగుపెట్టడం లేదు.

బుజ్జగించినా..

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న బాలసానిని.. మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బుజ్జగించారు. మంత్రి హరీశ్‌రావుతో కూడా మాట్లాడించారు. పార్టీలో తనకు అవమానం జరిగిందని ఆయన అన్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో బాలసాని బీఆర్‌ఎస్‌లో కొనసాగుతారా.. ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అని అనుచరవర్గం ఎదురుచూస్తోంది. గుర్తింపు లేని చోట ఉండకూడదని అనుచరులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ నేతల నుంచి ఆహ్వానం అందినట్లు ప్రచారం సాగుతోంది.

గ్రీవెన్స్ డేకు బారులు!

ఎన్నికల కోడ్ వస్తుందన్న సమాచారంతో రద్దీ



రద్దీగా మారిన కలెక్టరేట్ ఆవరణ



కలెక్టరేట్‌కు వస్తున్న వృద్ధులు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలవుతుందనే సమాచారంతో వివిధ ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్‌కు బారులుదీరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే వినతిపత్రాలు స్వీకరించరని, సమస్యలు పరిష్కారం కావని భావించిన ప్రజలు పెద్దసంఖ్యలో గ్రీవెన్స్ డేకు వచ్చారు. దీంతో కలెక్టరేట్ రద్దీగా మారగా ఖాళీ ఉన్న చోటల్లా కూర్చుని ఫిర్యాదులు రాయడం కనిపించింది.

క్లుప్తంగా

సత్తుపల్లి మున్సిపల్‌లో అసిస్టెంట్ కలెక్టర్


మయాంక్ సింగ్

సత్తుపల్లిటౌన్: జిల్లాలో శిక్షణ నిమిత్తం వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ సోమవారం సత్తుపల్లి మున్సిపాలిటీలో బాధ్యతలు స్వీకరించారు. రెండు వారాల పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వర్తించనున్నారు. మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

13న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 13న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, అర్హులైన క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి


మాట్లాడుతున్న ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్

కొణిజర్ల: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని గిరిజన సంక్షేమ గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో సోమవారం సాయంత్రం డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఓ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వం సమకూరుస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. అనంతరం బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల ఆర్‌సీఓగా అంజలి


అంజలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోనకల్: బీసీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్(ఆర్‌సీఓ)గా బోనకల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజలి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, అంజలి ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓగా పదోన్నతి పొందడంపై బోనకల్ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను సన్మానించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

నేలకొండపల్లి: తెలంగాణ, ఏపీల్లోని వివిధ ప్రాంతాలకు చోరీలకు పాల్పడుతున్న నిందితుడు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. ఇటీవల మండలంలోని వివిధ గ్రామాల్లో చోరీలు జరిగాయి. దీంతో నిఘా పెంచిన పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సదరు నిందితుడు పట్టుబడ్డాడని సమాచారం. ఈమేరకు విచారణలో రెండు రాష్ట్రాల్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిసింది. అయితే, ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా ధృవీకరించలేదు.

రూ.20వేల విలువైన మద్యం పట్టివేత

రఘునాథపాలెం: మండలంలోని వ్యవ్వాడనగర్‌లో అక్రమంగా మద్యం నిల్వ చేసిన బెల్ట్‌షాపులో పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. పక్కాగా అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టి రూ.20వేల విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు. ఈమేరకు అమ్మకందారుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.ల్లో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,900	4,600
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	23,700	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	6,950	4,500

- ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.12,231

కేజీబీవీలో భద్రమేనా?

- అడవిని తలపించేలా పరిసరాలు
- ఆందోళనకు దిగిన విద్యార్థినుల తల్లిదండ్రులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల గుట్టపై ఏర్పాటు చేసిన కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలోని బాలికల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు వేసుకుని రావడంతో విద్యార్థినులు సొమ్మసిల్లిన విషయం విదితమే. దీంతో సోమవారం ఉదయం తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో చేరుకోగా, వారితో కలిసి వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి, కుల సంఘాల నాయకులు కూడా వచ్చి ఆందోళనకు దిగారు. ఖమ్మం - వైరా ప్రధాన రహదారి నుండి పాఠశాలకు వచ్చే దారి సక్రమంగా లేకపోవడం, చుట్టూ అడవిని తలపించేలా చెట్లు పెరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 311 మంది విద్యార్థినులు చదువుతున్నారని ఎస్‌ఓ జ్యోతి తెలిపారు. అయితే, పాఠశాల చుట్టూ మట్టి క్వారీలు ఉండగా... సమీపంలోని గుట్ట ఎక్కితే ఆవరణ మొత్తం కనిపిస్తోంది. అలాగే, ప్రహరీ ఉన్నా రక్షణగా ముళ్ల తీగ లేకపోవడంతో ఎవరైనా వచ్చే అవకాశముంది. దీంతో గత 5వ తేదీన ఒక ఆగంతకుడు ప్రాంగణంలోకి వచ్చినట్లు తెలుస్తుండగా ఆరోజు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని సమాచారం. దీంతో ఆదివారం కూడా ముసుగు వేసుకున్న వ్యక్తులు రావడంతో విద్యార్థినులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం, అంతర్గత ఘర్షణల కారణంగా ఎవరూ పట్టించుకోవడం లేదని సమాచారం. అలాగే, ఆరు సీసీ కెమెరాలు ఉన్నా దృశ్యాల్లో స్పష్టత ఉండడం లేదని తెలుస్తోంది. కాగా, తల్లిదండ్రులు ఆందోళన దిగారనే సమాచారంతో డీఈఓ సోమశేఖర్‌శర్మ, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, జీసీడీఓ భూలక్ష్మి వెళ్లి ధైర్యం చెప్పారు. పాఠశాల చుట్టూ, రహదారిపై వీధిలైట్లు ఏర్పాటు చేయించడమే కాక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అలాగే, పాఠశాల వద్ద సీఐ శ్రీహరి పర్యవేక్షణలో బందోబస్తుఏర్పాటు చేశారు.


పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, సంఘాల నాయకులు, (ఇన్‌సెట్) తల్లిదండ్రులకు నచ్చచెబుతున్న డీఈఓ శర్మ



శిక్షణ.. వ్యాఖ్యానం!

- టేబుల్ టెన్నిస్ శిక్షణలో సాంబమూర్తి గుర్తింపు
- క్రీడాకారులను రాష్ట్రస్థాయికి తీర్చిదిద్దుతున్న 'ఓలేటి'
- మరోపక్క ఆసక్తితో వ్యాఖ్యాతగా రాణిస్తున్న వైనం


ఓలేటి సాంబమూర్తి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా క్రీడా రంగంలో టేబుల్ టెన్నిస్‌ను పతాక స్థాయిలో నిలిపేందుకు మూడు దశాబ్దాల నుంచి సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. 1991లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా వృత్తి చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఎందరో క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దిన ఆయన టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ పదవి ద్వారా రాష్ట్రస్థాయి పోటీలను అంతే సమర్థవంతంగా నిర్వర్తించారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఓ ప్రైవేట్ పాఠశాలలో చేరి.. 1991నుంచి ఇరవై ఏళ్ల పాటు ఎందరో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీశారు. జాతీయస్థాయిలో ఖమ్మంకు చెందిన వి.సునీల్, సతీష్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఇర్ఫాన్, వాలీబాల్‌లో స్మితాచౌదరి తదితరులు అథ్లెట్లుగా ఎదగగా... స్వతహాగా అథ్లెట్ అయిన సాంబమూర్తి వీరిని తీర్చిదిద్దారు. కాగా, 2021 నాటికి వ్యాయామ ఉపాధ్యాయ వృత్తిని వదిలి టేబుల్ టెన్నిస్ క్రీడపై దృష్టి సారించి క్రీడాకారులను సానపడుతున్నారు.


క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ... (ఫైల్)


రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన వారితో సాంబమూర్తి తదితరులు

70 మందికి పైగానే..

టేబుల్ టెన్నిస్ క్రీడను 1996లో జిల్లాలో ప్రవేశపెట్టగా, అప్పట్లోనే పలువురు రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదిగారు. ఆతర్వాత కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్నా 2021 నుంచి విస్తృతంగా అభివృద్ధి చేయాలనే ఆశయంతో జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు సాంబమూర్తి శిక్షణ ఇస్తున్నారు. గడచిన రెండేళ్లలో 70 మందికి పైగా క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం వెనుక సాంబమూర్తి కృషి ఉండగా.. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చొరవతో ఇప్పటికే 30 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం రాష్ట్రస్థాయికి ఎదిగారు. కాగా, జిల్లకు చెందిన గద్దల సిరి టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్రస్థాయిలోనే ఐదో ర్యాంక్‌లో నిలవడం విశేషం.

ఉత్తమ వాఖ్యాతగా అంచెలంచెలుగా..

క్రీడల్లో తన ప్రాధాన్యతను కాపాడుకుంటూనే ఆసక్తితో వ్యాఖ్యాతగానూ సాంబమూర్తి రాణిస్తున్నారు. జిల్లా కేంద్రంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ఎక్కడ జరిగినా తనదైన శైలిలో వ్యాఖ్యానం చేస్తున్న ఆకట్టుకోవడం ఆయన శైలి. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడే సాంబమూర్తితీరును జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందిస్తుంటారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్‌లో జిల్లా క్రీడాకారులను జాతీయస్థాయికి తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెబుతారు. జాతీయ స్థాయి టోర్నీల్లో ర్యాంకింగ్ క్రీడాకారులుగా ఎదిగేందుకు తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు.

పేదల కోసం కేంద్రం సంక్షేమ పథకాలు

ఖమ్మం మామిళ్లగూడెం: పేదల కోసం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వాన అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డును ఏర్పాటు చేయడంతో సోమవారం ఖమ్మం గాంధీచౌక్‌లో ప్రధాని ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ రైతులతో పాటు అన్నివర్గాల ప్రజల కోసం పథకాలు అమలుచేస్తున్న మోదీకి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు అల్లిక అంజయ్యయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మూర్తి వీరభద్రప్రసాద్, మందా సరస్వతి, దొడ్డా అరుణ, పమ్మి అనిత, జ్వాలా నర్సింహారావు, డోకుపర్తి రవీందర్, కొణతం లక్ష్మీనారాయణ, అంకిత పాపారావు, జంగిలి రమణ, డోనేవాన్ దాస్, మధు, గోలి ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చేపల పంపిణీలో గందరగోళం

అధికారులను నిలదీసిన మత్స్యకారులు

కారేపల్లి: జూలై, ఆగస్టులో పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను ఆలస్యంగా ఇవ్వడమే కాక నాసిరకం చేప లు పంపిణీ చేస్తున్నారని మత్స్యకారులుమారోపించారు. కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యాన మత్స్యకారులకు సోమవారం చేపపిల్లలు పంపిణీ చేశారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో 50 చెరువులకు గాను 9.60లక్షల చేప పిల్లలను పంపిణీ చేశామని, మరో వారంలో మిగిలిన ఆరు పెద్ద చెరువులకు 5.40లక్షల పిల్లలు పంపిణీ చేస్తామని చెప్పారు. అయితే, మత్స్యకారులు మాట్లాడుతూ ఆలస్యంగా ఇవ్వడమే కాక చిన్న సైజ్ చేపపిల్లలు తీసుకొచ్చారని అడ్డుకున్నారు. దీనికి అధికారులు స్పందిస్తూ ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయాలనుకున్నా కుదరకపోవడంతో ఆలస్యంగా జరిగిందని తెలిపారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పడిన కొత్త సంఘాల్లో గిరిజనేతర సభ్యులను తొలగించగా, పాత సంఘాల్లో ఎక్కడా తొలగించలేదన్నారు. సర్పంచ్‌లు ఆదెర్ల స్రవంతి, అజ్మీరా నరేష్‌తో పాటు హన్మంతరావు, తిలక్ కిషోర్, నిరంజన్, నరేష్, నాగమణి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో వాగ్వాదానికి దిగిన మత్స్యకారులు

బీసీ బంధు నిరాకరించారని ఆందోళన

కామేపల్లి: బీసీబంధు చెక్కు తనకు మంజూరైనా ఇవ్వలేదని ఆరోపిస్తూ ఓ యువకుడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనక దిగారు. మండలంలోని 31 మందికి బీసీ బంధు మంజూరు చేశారు. వీరికి సోమవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చెక్కులు అందజేయగా, చల్లా వెంకటేశ్వర్లు పేరు జాబితాలో ఉన్నా ఇవ్వలేదు. ఇదేమిటని ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డిని అడగగా ఇంకో వ్యక్తి చెక్కు పొరపాటున వెంకటేశ్వర్లు పేరిట రావడంతో చెక్కు ఆపాలని జిల్లా అధికారులు చెప్పారన్నారు. దీంతో ఆయన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో నిరసనకు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ అడగగా పేరు పొరపాటుగా రావడంతో అధికారుల సూచన మేరకు చెక్కు ఇవ్వలేదని వెల్లడించచారు.

పట్టుబడిన వాహనాలకు 11న వేలం

నేలకొండపల్లి: నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 11న వేలం వేయనున్నట్లు సీఐ కుమ్మరి పోశెట్టి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన బొలేరొ, టాటా ఏస్, ఆటోలను వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వివరాలు తమ కార్యాలయంలో వివరాలు తెలుసుకోవడంతో 11వ తేదీన ఉదయం 11 గంటలకు మొదలయ్యే వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కృషి బైపాస్‌రోడ్డులో నివాసముంటున్న ఎస్.కే.జానీ ఇంట్లో చోరీ జరిగింది. జానీ సహా ఆయన కుటుంబీకులు లేని సమయాన సోమవారం తెల్లవారుమున గుర్తుతెలియని వ్యక్తుల చోరీ పాల్పడ్డారు. ఇంట్లోని ఐదు తులాల బంగారం, రూ.50వేల నగదులు ఎత్తుకెళ్లానని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టణ సీఐ జి.మోహన్‌బాబు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థుల ఆత్మహత్య

వేర్వేరు గ్రామాల్లో ఘటనలు


నాగేశ్వరి (ఫైల్)


విజయ్ (ఫైల్)

తల్లాడ: వేర్వేరు గ్రామాలకు డిగ్రీ విద్యార్థులు ఇద్దరు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తల్లాడ మండలం మంగాపురానికి చెందిన కుంచం నాగేశ్వరి(18) ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అలాగే, నారాయణపురం గ్రామానికి చెందిన సంగసాని విజయ్(18) సైతం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వీరిలో నాగేశ్వరి రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరంలో చేరి అక్కడి నుంచి వైరాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు మారింది. ఇక విజయ్ క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సమీప గ్రామాలకు చెందిన వీరిద్దరు తొలుత ఒకే కళాశాలలో చేరగా... ఒకే రోజు ఆత్మహత్యకు పాల్పడడం అనుమానాలకు తావిస్తుండగా, రెండు గ్రామాల్లో విషాదాన్ని నింపింది. కాగా, ఘటనలపై తమకు ఫిర్యాదు అందలేదని తల్లాడ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మోటార్ల దొంగలను పట్టుకున్న రైతులు

నేలకొండపల్లి: రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న మోటార్ల దొంగలను రైతులే పథకం ప్రకారం పట్టుకున్నారు. మండలంలోని ఆరెగూడెంలో ఇటీవల పొలాల వద్ద మోటార్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో చేతికి వచ్చిన పంటలకు నీరు అందించలేక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈనేపథ్యాన కొందరు రైతులు రెండు రోజులుగా పొలాల వద్ద కాపలా ఉంటున్నారు. ఈక్రమాన సోమవారం రాత్రి ముగ్గురు దొంగలు ఆరెగూడెంకు చెందిన పొలాల్లో మోటార్లను ఆయుధాలతో ధ్వంసం చేసి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా రైతులు వారిని బంధించారు. ఈక్రమంలో ఓ వ్యక్తి తప్పించుకోగా, మిగతా ఇద్దరిని గ్రామంలో బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చామని రైతులు వడ్డె శ్రీనివాసరావు, దిగుదుపాటి రోశయ్య, వడ్డె యుగంధర్, దొంతగాని నాగేశ్వరరావు, మీగడ లింగరాజు తదితరులు తెలపారు.


ఆరెగూడెం రైతులకు చిక్కిన నిందితులు

ఖమ్మంలో గంజాయి కలకలం

రెండు చోట్లా 25 కేజీలకు పైగా సరుకు స్వాధీనం

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో ఇటీవల తరచుగా గంజాయి పట్టుబడుతోంది. ఈమేరకు సోమవారం ఎక్సైజ్ అధికారులు చేపట్టి తనిఖీల్లో రెండు చోట్ల 25 కేజీలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ స్టేషన్ సీఐ-2 రాజిరెడ్డి ఆధ్వర్యాన ఎఫ్‌సీఐ గోదాం వద్ద తనిఖీ చేపట్టగా బీహార్ రాష్ట్రానికి చెందిన పంకజ్ మోహతా పట్టుబడ్డాడు. ఆయనను తనిఖీ చేయగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి తీసుకొస్తున్న రూ.4లక్షల విలువైన 15.800 కేజీల గంజాయి లభించింది. అలాగే, ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ రాజు ఆధ్వర్యాన శ్రీశ్రీ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న రూ.2లక్షల విలువైన 10.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు చండ్రుగొండ మండలం పోకలగూడెంకు చెందిన బోడ సాయికుమార్, తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెంకు చెందిన గోకినపల్లి సంతోష్, ఖానాపురానికి చెందిన ఆకుల శరత్‌కుమార్, తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన ముదిగొండ సందీప్ ముఠాగా ఏర్పడి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో సీఐలు విజేందర్, సర్వేశ్వరరావు, ఎస్సై అద్బారావు, సరిత, శంకర్, అనిల్, రబ్బానీ, లతతో పాటు సిబ్బంది నాయక్, మధు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామారావు, శశికాంత్, సుధీర్, హరీశ్, హన్మంతరావు, వెంకటేష్, విజయ్, రమేష్, రవి, మారేశ్వరరావు పాల్గొన్నారు.




ఎఫ్‌సీఐ గోదాం, శ్రీశ్రీ సర్కిల్ వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

డెంగీతో వివాహిత మృతి


హరిచందన (ఫైల్)

వైరా: డెంగీ జ్వరం బారిన పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. వైరాకు చెందిన వ్యాపారి అనుమోలు చంద్రయ్య కుమారుడు రాజేష్‌కు ఈ ఏడాది మే 30న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన హరిచందన(23)తో వివాహం జరిగింది. మూడు రోజుల క్రితం ఆమె జ్వరంతో బాధపడుతుండగా వైరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేక హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే ఆమె సోమవారం మృతి చెందింది. వివాహం జరిగిన నాలుగున్నర నెలలకే హరిచందన మృతి చెందగా, కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహం వద్ద బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తదితరులు నివాళులర్పించారు.

తేలుకాటుతో మహిళ...

పెనుబల్లి: వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన మహిళను తేలు కుట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. పెనుబల్లి మండలం రామచంద్రాపురానికి గ్రామానికి కాళంగి రుతుమణి కుమార్తె మౌనిక(25)ను వేంసూరు మండలం తూతక్క లింగన్నపేటకు చెందిన కోలా ఉపేందర్‌రావుకు ఇచ్చి ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల మౌనిక పుట్టినిల్లయిన రామచంద్రాపురం రాగా, తల్లితో కలిసి బుధవారం మిరప చేలో కలుపు తీయడానికి వెళ్లింది. ఈ క్రమంలో మౌనిక చేతిపై ఎర్ర తేలు కుట్టగా కేకలు వేయడంతో పెనుబల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మౌనిక సోమవారం తెల్లవారుజామున మృతి చెందగా, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు...

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో గుంటి కృష్ణమూర్తి(60) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కస్నాతండాకు చెందిన కృష్ణమూర్తి టీవీఎస్ ఎక్సెల్‌పై ఖమ్మం వెళ్తుండగా, ఎం.వెంకటాయపాలెం వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణమూర్తి తీవ్రగాయాలతో మృతి చెందగా, ఢీకొట్టిన వాహనదారుడికి గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

జిల్లాస్థాయి చెస్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-15 చెస్ ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. ఈమేరకు అండర్-15 బాలికల విభాగంలో జంగం శ్రీకళ(నేలకొండపల్లి) మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, పి.సుధాశ్రీ, పల్లవి, వర్షిత ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. అలాగే, అండర్-15 బాలుర విభాగంలో త్రివేణి స్కూల్‌కు చెందిన శరత్ మొదటి స్థానంలో నిలవగా, లోకేష్, విగ్నేష్, గౌతమ్‌కృష్ణ ఆ తర్వాత స్థానాలు కైవసం చేసుకున్నారని చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.జోత్స్న తెలిపారు. పోటీల ముగింపు సమావేశంలో త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారుడు సీహెచ్.గోపీకృష్ణ, పాఠశాల సిబ్బంది చార్లెస్, ముస్తఫా, సందీప్ పాల్గొన్నారు.


విజేతలతో త్రివేణి ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, తదితరులు

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి

పెనుబల్లి/వేంసూరు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నాయకుడు కొండూరు సుధాకర్ వెల్లడించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం ఐదో రోజుకు చేరగా పెనుబల్లి, వేంసూరు మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనని తెలిపారు. రూ.500కే గ్యాస్, రూ.5 లక్షలతోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, రూ.4వేలు పింఛన్, రైతు రుణమాఫీ తదితర పథకాలు అధికారంలోకి రాగానే అమలుచేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు బంజర్‌లో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలాలను నాయకులు పరిశీలించి వెంటనే సాగర్ జలాలను చివరి ఆయకట్టు భూముల వరకు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, పిల్లి నవజీవన్, ముప్పా అశోక్, మందపాటి వెంకటరెడ్డి, అలుగోజు చిన్న స్వామి, వంగా దామోదర్, తుమ్మలపల్లి లక్ష్మణరావు, తెల్లం సురేష్, గాయం నాగరాజు, ఆవులూరి రామకృష్ణారెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, బండి వెంకటేశ్వరరెడ్డి, జంగ జమలయ్య, కనమతరెడ్డి రంగారెడ్డి, నాయుడు బాపూజీ తతదితరులు పాల్గొన్నారు.


ఎండిపోతున్న వరిపొలాలను పరిశీలిస్తున్న సుధాకర్, నాయకులు